## కంభాపూర్‌లో ఆరోగ్య శిబిరం


పరీక్ష నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పిట్లం, డిసెంబర్ 15: మండలంలోని కంభాపూర్ గ్రామ అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో శుక్రవారం వైద్యసిబ్బంది ప్రజలకు హెచ్‌ఐవీ పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్యం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ భూమవ్వ, పంచాయతీ కార్యదర్శి తుకారాం, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## ఎరువులు, పురుగుమందు నమూనాల సేకరణ


శాంపిళ్లను సేకరిస్తున్న ఏవో నరేశ్

గాంధారి, డిసెంబర్ 15: మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాల్లో మండల వ్యవసాయాధికారి నరేశ్ శుక్రవారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఎరువులు, పురుగుమందుల నమూనాలను సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సేకరించిన శాంపిళ్లను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపిస్తామని తెలిపారు. మందులు నకిలీవి అని తేలితే.. తయారు చేసిన కంపెనీలతోపాటు వాటిని విక్రయించిన దుకాణాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## మున్నూరు కాపు సంఘం కార్యవర్గం ఎన్నిక

రామారెడ్డి, డిసెంబర్ 15: మండల కేంద్రంలోని మున్నూరుకాపు సదర్ సంఘం కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం మండల అధ్యక్షుడు కడెం శ్రీకాంత్ తెలిపారు. అధ్యక్షుడిగా గాండ్ల నర్సింహులు, ఉపాధ్యక్షులుగా నేరుళ్ల నర్సింహులు, ఎర్రోళ్ల స్వామి, కార్యదర్శిగా కడెం భైరయ్య, సంయుక్త కార్యదర్శిగా ఆర్గొండ ప్రసాద్, కోశాధికారిగా ఇసాయిపేట భైరయ్య ఎన్నికయ్యారని పేర్కొన్నారు.

## ఇంటి పన్ను వసూలు

నిజాంసాగర్, డిసెంబర్ 15: మండలంలోని మంగ్లూర్‌లో ఇంటి పన్నుల వసూలుకు స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నామని పంచాయతీ కార్యదర్శి బాలరాజు తెలిపారు. శుక్రవారం ప్రతి ఇంటికీ వెళ్లి పన్ను చెల్లించాలని సూచించారు. వంద శాతం పన్ను చెల్లిస్తేనే గ్రామాభివృద్ధి సాధ్యమని కార్యదర్శి అన్నారు. అనంతరం పలు కాలనీల్లో కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు.


గాంధారిలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు


పిట్లంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న ఆటో డ్రైవర్లు

# మహాలక్ష్మీ పథకాన్ని తొలగించాలి

### కొనసాగుతున్న ఆటో డ్రైవర్ల నిరసన

గాంధారి/పిట్లం, డిసెంబర్ 15: తమ జీవనోపాధిని దెబ్బ తీస్తున్న మహాలక్ష్మీ పథకాన్ని తొలగించాలని కోరుతూ ఆటో డ్రైవర్లు గాంధారి తహసీల్దార్ జానకికి శుక్రవారం వినతి పత్రాన్ని అందజేశారు. అంతకు ముందు ఆటోడ్రైవర్లు మహాలక్ష్మీ పథకాన్ని వ్యతిరేకిస్తూ ప్రధాన రహదారిపై ఆటోలతో ర్యాలీ తీశారు. స్థానిక నెహ్రూ విగ్రహం వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆటోల్లో ప్రయాణించే వారి సంఖ్య తగ్గిందని అన్నారు. దీంతో తాము ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

పిట్లంలోని ఆటో యూనియన్ సభ్యులు కాలి నడకన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆటోల్లో మండలకేంద్రంలోని ప్రధాన వీధుల్లో తిరుగుతూ ప్రభుత్వం తమ కుటుంబాలను ఆదుకోవాలని నిరసన తెలిపారు. ర్యాలీగా తహసీల్ కార్యాలయానికి వెళ్లి నాయబ్ తహసీల్దార్ నరేశ్‌కు వినతిపత్రం సమర్పించారు.

## ఉపాధి డబ్బుల చెల్లించాలని పోస్టాఫీస్‌కు తాళం


సదాశివనగర్ పోస్టాఫీస్ ఎదుట ఆందోళన చేస్తున్న కూలీలు

సదాశివనగర్, డిసెంబర్ 15: ఉపాధి పనుల కూలి డబ్బులు చెల్లించడం లేదని సదాశివనగర్ పోస్టాఫీస్‌కు తాళం వేసి కూలీలు శుక్రవారం నిరసన తెలిపారు. సర్పంచ్ బద్దం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో రెండు వందల మంది కూలీలు పోస్టాఫీస్ ఎదుట బైఠాయించారు. తమకు రావాల్సిన రూ.17లక్షల కూలి డబ్బులు చెల్లించడంలో పోస్టాఫీస్ అధికారులు నాలుగు నెలలుగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. విషయం తెలుసుకున్న ఎంపీడీవో లక్ష్మి, కలెక్టర్ కార్యాలయం నుంచి వచ్చిన కల్పన, ఈజీఎస్ అధికారులు కూలీలను సముదాయించారు. కూలి డబ్బులు చెల్లించేవిధంగా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో హామీ ఇచ్చారు. దీంతో వారు ఆందోళనను విరమించారు.

## చిన్నారులకు అక్షరాభ్యాసం

పిట్లం, డిసెంబర్ 15: మండలంలోని అన్నారం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సామూహిక సీమంతాలు, అక్షరాభ్యాసం నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రేణుక చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషకాహారం తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు అనురాధ, మంజుల, ఆశ వర్కర్ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

## పిట్లంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

పిట్లం, డిసెంబర్ 15: మండలకేంద్రంలోని ప్రభుత్వ దవాఖాన ఆవరణలో శుక్రవారం లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కిషన్ ఆధ్వర్యంలో కిషన్ ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 51 మందిని పరీక్షించారు. వారిలో 16 మందికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించారు. ఏడుగురికి ఆపరేషన్ అవసరమని బోధన్ లయన్స్ కంటి దవాఖానకు తరలించారు. కార్యక్రమంలో డాక్టర్లు హరికిషన్‌రావు, శివకుమార్, సమద్, లయన్స్ క్లబ్ బాధ్యులు కాశీరెడ్డి, చంద్రశేఖర్, వెంకట్‌రాములు పాల్గొన్నారు.

## పశువులకు గర్భ కోశ వ్యాధి
# నివారణ శిబిరం

రాజంపేట్, డిసెంబర్ 15 : రాజంపేట మండలం ఆరేపల్లి గ్రామంలో మండల పశు వైద్యాధికారి అనిల్‌రెడ్డి ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధి నివారణ శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువులకు సోకే వ్యాధులు, నివారణ చర్యలు, చికిత్స విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. గర్భకోశ వ్యాధి చికిత్సతోపాటు 15 పశువులకు సాధారణ చికిత్స, 25 దూడలకు నట్టల నివారణ చికిత్సను అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ యాదగిరి, పాల కేంద్రం అధ్యక్షుడు స్వామి గౌడ్, సిబ్బంది నర్సింహులు, వైద్యాధికారి రాంచందర్, పశువైద్య సిబ్బంది రమేశ్, రైతులు హాజీ, సురేశ్, లింగం, బాబు తదితరులు పాల్గొన్నారు.

### మహిళా ప్రయాణికులు వెంట
## గుర్తింపు కార్డును తీసుకెళ్లాలి

కామారెడ్డి, డిసెంబర్ 15: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించిన నేపథ్యంలో మహిళలు గుర్తింపు కార్డును వెంట తీసుకెళ్లాలని కామారెడ్డి డిపో మేనేజర్ ఇందిర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అడ్రస్ ప్రూఫ్ కోసం ఒరిజినల్ లేదా జిరాక్స్‌ను చూపించాలని సూచించారు. ఆధార్, ఓటరు, డ్రైవింగ్ లైసెన్స్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన గుర్తింపు కార్డు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన నివాస గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకెళ్లి ప్రయాణించాలని సూచించారు.

## రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న రిలయన్స్ ఫౌండేషన్ జిల్లా మేనేజర్ రాజు

పెద్ద కొడప్‌గల్, డిసెంబర్ 15: రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి పర్యావరణ అనుకూల పద్ధతులు పాటించాలని రిలయన్స్ ఫౌండేషన్ జిల్లా మేనేజర్ రాజు అన్నారు. పెద్ద కొడప్‌గల్ మండలంలోని లింగంపల్లి రైతు వేదికలో శుక్రవారం వ్యవసాయ పర్యావరణ అనుకూల పద్ధతులు, సాంకేతికతపై రైతులకు రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని లింగంపల్లి, విఠల్‌వాడి, విఠల్‌వాడి తండా, పోచారం, పోచారం తండా, శివ్వాపూర్, తలాబ్ తండా తదితర గ్రామాల రైతులు అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. జీవ సంబంధిత ఎరువులైన పీఎస్‌బీ, నానో యూరియా, నానో డీఏపీ, వేస్ట్ డీకంపోసర్ వంటి ఎరువులు వాడడంతో వాతావరణం కాలుష్యం కాదని, పంట అభివృద్ధికి దోహదపడుతాయని తెలిపారు. రైతులు భూసార పరీక్షలు నిర్వహించి వాటి ఫలితాల ఆధారంగా పంటలను సాగుచేస్తూ.. సరైన ఎరువులు వాడాలని సూచించారు. సేంద్రియ ఎరువులను వినియోగించి భూసారన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌వో రామకృష్ణ, డీపీఎం వీరేశం, ఏఈవో మాధవి, రైతులు శంకర్ రావు, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి పనుల పరిశీలన


జనగామలో పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో పూర్ణచంద్రోదయ కుమార్

బీబీపేట, డిసెంబర్ 15: మండలంలోని జనగామ గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం ఎంపీడీవో పూర్ణచంద్రోదయ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీల హాజరు పట్టికను పరిశీలించారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి కూలీకి ఉపాధి పని కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్ కళ్యాణికి సూచించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## స్కాలర్‌షిప్‌ను వెంటనే విడుదల చేయాలి


మాట్లాడుతున్న విద్యార్థి సంఘం నాయకులు

బాన్సువాడ టౌన్, డిసెంబర్ 15: పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థుల స్కాలర్‌షిప్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బాన్సువాడ బీసీ విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో శుక్రవారం సంఘం నాయకులు విద్యార్థుల సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం బాన్సువాడ డివిజన్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. బీసీ విద్యార్థి సంఘం జిల్లా నాయకులు నిఖిల్ గౌడ్, మండల అధ్యక్షుడు రాఘవ, నాయకులు నవీన్, రాజు, విష్ణు, సాయి తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు ఫిజియోథెరపీ

నస్రుల్లాబాద్/పిట్లం, డిసెంబర్ 15 : నస్రుల్లాబాద్‌లోని ప్రాథమిక పాఠశాలలోని దివ్యాంగ విద్యార్థులకు శుక్రవారం భవిత సెంటర్‌లో ఫిజియోథెరపీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మనీషా మాట్లాడుతూ.. పాఠశాలలోని మొత్తం తొమ్మిది మందికి ఫిజియోథెరపీ నిర్వహించామని తెలిపారు. దివ్యాంగ పిల్లలకు ఇంటి దగ్గర చేయాల్సిన వ్యాయామాలు గురించి తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చందర్, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పిట్లంలోని భవిత సెంటర్‌లో దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ శిబిరాన్ని ఎంఈవో దేవీసింగ్ ప్రారంభించారు. వైద్యాధికారిణి విశాలాక్షి ఫిజియోథెరపీ నిర్వహించి వారి ఆరోగ్యం మెరుగుపడేలా వారి తల్లితండ్రులకు ఇంటి వద్ద చేయించాల్సిన వ్యాయామాలను వివరించారు. కార్యక్రమంలో ఐఈఆర్టీలు కమల్‌కిశోర్, గంగాధర్, సిబ్బంది పాల్గొన్నారు.